ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

గురువారం 30 జనవరి 2025

గవర్నర్‌కు ప్రవర్తనా నియమావళి రూపొందించండి

- బిల్లులపై సంతకానికి గడువు విధించాలి
- డీఎంకే ఎంపీల సమావేశంలో తీర్మానం



సమావేశంలో సీఎం స్టాలిన్, మంత్రి దురైమురుగన్, ఎంపీ టీఆర్‌బాలు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పాలనవ్యవహారాల్లో మితిమీరి జోక్యం చేసుకుంటున్న గవర్నర్‌కు ప్రవర్తనా నియమావళి రూపొందించాలని, రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులపై సంతకం చేసేందుకు గవర్నర్‌కు నిర్ణీత గడువు కూడా విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ డీఎంకే ఎంపీల సమావేశంలో ఓ తీర్మానం చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో డీఎంకే ఎంపీల సమావేశం తేనాంపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో బుధవారం డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆరు తీర్మానాలను ఆమోదించారు. రాష్ట్రాలకు గవర్నర్లు అవసరం లేదని డీఎంకే మొదటి నుండి వాదిస్తున్నప్పటికీ గవర్నర్ పదవికి గౌరవ మర్యాదలను ఇస్తూనే ఉందని, అయితే ప్రస్తుత గవర్నర్ రవి పాలనా వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడంతో పాటు ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఆయన పదవికే కళంకం తెస్తున్నారని ఆరోపించింది. ఈ పరిస్థితులలో రాజకీయమయమవుతున్న గవర్నర్ పదవి గౌరవాన్ని కాపాడుకునేలా, గవర్నర్లకు ప్రత్యేకంగా ప్రవర్తనా నియమావళి (కోడ్ ఆఫ్ కాండక్ట్)ను రూపొందించాలని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించే బిల్లులకు ఆమోదం తెలిపి సంతకం చేసేందుకంటూ నిర్ణీత గడువును (టైమ్ ఫ్రేమ్) కూడా విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తొలి తీర్మానాన్ని ఆమోదించింది. మదురై సమీపం మేలూరు వద్ద టంగ్‌స్టన్ తవ్వకాల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి ఆ ప్రాజెక్టును రద్దు చేయించిన ముఖ్యమంత్రికి, ఆందోళనకారులకు ధన్యవాదాలు తెలుపుతూ మరొక తీర్మానం చేశారు. ఇనుపయుగం 5370 యేళ్లకు మునుపే తమిళనాట ప్రారంభమైందనే విషయాన్ని కేంద్రప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచ దేశాలకు ఎలుగెత్తి చాటాలని మూడో తీర్మానంలో కోరింది. వీసీలను నియమించడంపై సెర్చికమిటీలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా యూజీసీ విధించిన కొత్త నిబంధనలను ఖండిస్తూ డీఎంకే యువజన విభాగం ఫిబ్రవరి 6న రాష్ట్రవ్యాప్తంగా జరుపతలపెట్టిన ఆందోళనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మరో తీర్మానంలో విజ్ఞప్తి చేసింది. అదే రోజున ఢిల్లీలో డీఎంకే ఎంపీలు కూడా ధర్నా చేస్తారని పేర్కొంది. మైనారిటీల సంక్షేమానికి వ్యతిరేకంగా వక్ఫ్‌బోర్డు చట్టసవరణ బిల్లును ఆమోదించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ మరో తీర్మానం చేసింది. గత యేడాది బడ్జెట్‌లో కనీసం 'తమిళనాడు' అనే పదానికి కూడా తావివ్వని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈయేడాది బడ్జెట్‌లోనైనా రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులకు, పెండింగ్ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించాలని, మరిన్ని రైల్వే పథకాలను అమలుకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ఆరో తీర్మానం చేసింది. ఈ సమావేశంలో పార్టీ ఎంపీలు కనిమొళి, దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండ్యన్, జగద్రక్షగన్, తిరుచ్చి శివ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.



రామేశ్వరం అగ్నితీర్థంలో పుణ్యస్నానాలు

భక్తిశ్రద్ధలతో తై అమావాస్య

- రాష్ట్రవ్యాప్తంగా తీరప్రాంతాల్లో పవిత్ర స్నానాలు
- పితృదేవతలకు తర్పణాలు



తామ్రభరణి నదీతీరంలో..



మైలాపూర్ కపాలీశ్వరాలయం కొలను వద్ద..



మెరీనా తీరంలో తర్పణాలు...

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తై అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తీరప్రాంతాలకు వెళ్లిన లక్షలాదిమంది పవిత్ర స్నానాలు ఆచరించి పితృదేవతలకు తర్పణాలు వదిలారు. ఏడాదిలో వచ్చే అన్ని అమావాస్యల కంటే సంక్రాంతి తర్వాత వచ్చే తై అమావాస్య రోజున దేవతలు స్వయంగా భూమిపైకి దిగి ఆశీర్వదిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ముఖ్యంగా రాజధాని నగరం చెన్నై, కన్నియాకుమారి సముద్రతీరాలు బుధవారం తెల్లవారుజాము నుండే భక్తులతో కిటకిటలాడాయి ఉపవాసం చేపట్టిన భక్తులు నదులు, ఆలయాల ప్రాంగణాల్లోని కోనేర్లు, చెరువులు, సముద్రతీరాల్లో పురోహితుల సమక్షంలో పితృదేవతలకు తర్పణాలు వదిలారు. తర్పణాలు వదిలిన అనంతరం ఆలయంలో దానధర్మాలు చేశారు.

రామేశ్వరంలో...

రామనాథపురం జిల్లా రామేశ్వరంలోని అగ్నితీర్థలో తెల్లవారుజాము 4 గంటల నుండే భక్తులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు, సూర్యోదయం తరువాత పవిత్ర స్నానాలు ఆచరించి, పితృదేవతలను భక్తిశ్రద్ధలతో సేవించారు. అనంతరం రామనాథస్వామి ఆలయ ప్రాంగణంలోని మహాలక్ష్మీ తీర్థకొలను నుంచి కోటితీర్థం వరకు స్నానాలు ఆచరించారు. తర్వాత పర్వతవర్థిణి సమేత రామనాథస్వామి వారి దర్శనం చేసుకున్నారు.

చదురగిరిలో ...

విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపం లో పశ్చిమ కనుమల మధ్య ప్రసిద్ధి చెందిన చదురగిరి సుందరమహాలింగం ఆలయంలో వేలాది మంది భక్తులు మంగళవారం రాత్రి నుండే చేరారు. అటవీ శాఖ సిబ్బంది పర్యవేక్షణలో బుధవారం ఉదయం 6 గంటలకు భక్తుల లగేజీని తనిఖీ చేసి ప్రధాన గేటు తెరచి, చదురగిరి కొండపైకి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను దర్శనానికి అనుమతించారు. స్వామి వారికి 21 రకాల పూజా సామగ్రితో అభిషేకాలు, విశేషాలంకారం, దీపారాధన నిర్వహించారు. అటవీ మార్గంలో వెళ్లిన భక్తులకు వన్యప్రాణుల వల్ల ప్రమాదం జరగకుండా అటవీశాఖ అధికారురులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కాగా, తై అమావాస్య పర్వదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధిచెందిన సముద్రతీరాలు, ఆలయాలకు ప్రభుత్వ రవాణా సంస్థలు భక్తుల సౌకర్యార్థం బస్సులు నడిపాయి.

తిరుచ్చి...

తిరుచ్చి సమీపంలోని శ్రీరంగం క్షేత్రంలో అమావాస్య పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ ప్రాంతంలోని అమ్మా మండపం ఘాట్‌లో తెల్లవారుజామునుండే వేలాది మంది భక్తులను స్నానాలకు అనుమతించారు. అనంతరం ఆ ఘాట్‌లో మెట్లపై పితృదేవతలకు తర్పణాలు వదిలారు. అదే విధంగా గరుడ మండపం, ముసిరి, తొట్టియం, తురైయూర్ అని తిరుచ్చి జిల్లాలో కావేరి నదితీర ప్రాంతాల్లో తర్పణాలు వదిలి ఉపవాసాన్ని విరమించుకున్నారు. నాగపట్నం జిల్లాలోని వేలాంకన్ని, కామేశ్వరం, మైలాడుదురై తీరప్రాంతాలు, తంజావూర్ జిల్లా తిరువైయ్యారు కావేరి పుష్ప మండపం ఘాట్, కల్లనై డ్యాం, పూంపుహార్ సముద్రతీరం, తిరువారూర్ త్యాగరాజస్వామి ఆలయ కమలాలయ తీర్థకొలను, పాపనాశం, కుంభకోణంలో ఉన్న కావేరి పుష్కర ఘాట్, కరూర్ జిల్లాలో కులిత్తలై, కృష్ణరాయపురం, అరవకుర్చీ, కావేరి పరివాహకప్రాంతాలు, అమరావతి, తిరునల్వేలి జిల్లాలోని తామ్రభరణి నదీతీరాలు, పుదుకోట, అరియలూరు, పెరంబలూరు జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు పుణ్య స్నానాలు చేశారు. డెల్టాజిల్లాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. నగరంలోని మైలాపూర్ కపాలేశ్వరాలయం, ట్రిప్లికేన్ పార్థసారథి స్వామి ఆలయం, ప్యారీస్ కందస్వామి ఆలయం, కాళికాంబాలయాలు, మెరీనా సముద్రతీరంలో భక్తులు పితృదేవతలను తర్పణాలు వదిలి పూజలు చేశారు.

కన్నియాకుమారి...

ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కుమరిలోని త్రివేణి సంగమంలో కనీవినీ ఎరుగని రీతిలో లక్షలాది మంది భక్తులు సముద్రంలో స్నాన మాచరించి పితృదేవతలకు తర్పణాలు వదిలారు. సముద్రతీరంలోని పరుశురామాలయం, భగవతి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. తై అమావాస్య సందర్భంగా భగవతి అమ్మవారి ఆలయంలో విశ్వరూప దర్శనం, అమ్మవారికి సుగంధద్రవ్యాలు, పంచామృతాభిషేకించి, నివేదపూజలు నిర్వహించి భక్తలను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం 3 గంటలనుండి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి, వెండి జింకవాహనంలో పురవీధుల్లో ఊరేగించారు.

విజయ్‌తో ఆదవ్ అర్జున్ భేటీ

- త్వరలో టీవీకేలో చేరిక.. ఆ వెంటనే కీలక పదవి?
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం!



విజయ్‌తో ఆదవ్ అర్జున్

చెన్నై, జనవరి29(ఆంధ్రజ్యోతి): గతంలో డీఎంకేతో అత్యంత సన్నిహితంగా మెలగి, ఆ తరువాత ఆ పార్టీకి బద్ధశత్రువులా మారిన పారిశ్రామికవేత్త ఆదవ్ అర్జున్ ప్రముఖ సినీ నటుడు విజయ్‌తో భేటీ అయ్యారు.బుధవారం సాయంత్రం పనయూరులోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) కార్యాలయానికి వెళ్లిన ఆదవ్ అర్జున్.. విజయ్‌తో సమావేశమయ్యారు.ఈసందర్భంగా వారి మధ్య పార్టీ వ్యూహరచన జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా వుండగా ఆదవ్ అర్జున్ త్వరలోనే టీవీకేలో చేరనున్నట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన పార్టీలో చేరగానే కీలక పదవి ఇచ్చేందుకు విజయ్ సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం. పార్టీ వ్యూహకర్తగా ఆయన్ని నియమించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఆదవ్ అర్జున్ గత అసెంబ్లీ ఎన్నికల ముందు డీఎంకే అధినేత స్టాలిన్‌కు అత్యంత సన్నిహితంగా మెలిగారు. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ డీఎంకేకు పని చేయడానికి కూడా ఆదవ్ అర్జునే కారణం. అయితే డీఎంకే అధికారంలోకి వచ్చాక.. ఆదవ్ అర్జున్‌ను పక్కనబెట్టినట్లు తెలుస్తోంది. దీంతో మనస్తాపం చెందిన ఆయన.. డీపీఐలో చేరారు. అక్కడా ఆయనకు స్వేచ్ఛ లేకపోవడంతో గత కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో వున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం విజయ్‌తో భేటీ కావడం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

జిల్లా నేతలతో విజయ్ భేటీ

టీవీకే అధినేత విజయ్.. బుధవారం కొత్తగా నియమితులైన 19 జిల్లా శాఖ నేతలతో సమావేశమయ్యారు. ఇప్పటి నుంచే అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావాలని, ప్రజలకు చేరువ కావాలని విజయ్ సూచించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో పాల్గొన్న 19 జిల్లా శాఖల నేతలకు ఆయన వెండి నాణేలను కానుకగా అందజేశారు. ఈ సమావేశం ముగిసిన కాసేపటికి కొన్ని జిల్లాల కార్యదర్శులను నియమిస్తున్నట్లు విజయ్ ప్రకటించారు. సౌత్‌చెన్నై నార్త్ జిల్లా శాఖ కార్యదర్శి టి.నగర్ కె. అప్పు (టి.నగర్, థౌజెండ్‌లైట్స్), సౌత్ చెన్నై సౌత్ జిల్లా శాఖ కార్యదర్శిగా దాము, (సైదాపేట, విరుగంబాక్కం), చెన్నై ఈస్ట్ జిల్లా శాఖ కార్యదర్శిగా అంబత్తూరు జి. బాలమురుగన్ (అంబత్తూరు, మదురవాయల్), చెన్నై సబర్బన్ జిల్లా శాఖ కార్యదర్శిగా ఈసీఆర్ శరవణన్ (షోళింగనల్లూరు, ఆలందూరు), మైలాడుదురైకి కుట్టి గోపి, కళ్ళకురిచ్చికి ప్రకాష్, కన్నియాకుమారి ఈస్ట్ జిల్లా శాఖ కార్యదర్శిగా మాధవన్, వెస్ట్ జిల్లా శాఖ కార్యదర్శిగా సబీన్, నాగపట్టినంకు సుకుమార్, దిండుగల్‌కు ధర్మా, ధర్మపురికి శివా, పుదుకోటకు పర్వేష్ నియమితులయ్యారు.

ఎగ్మూరులో 'యూనిటీ మాల్'

- శంకుస్థాపన చేసిన సీఎం స్టాలిన్





వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి, చిత్రంలో మంత్రులు, అధికారులు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత, ఖద్దరు శాఖల ఆధ్వర్యంలో ఎగ్మూరు కో-ఆప్టెక్స్ ప్రాంగణం వద్ద రూ. 227 కోట్లతో నిర్మించనున్న యూనిటి మాల్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ బుధవారం శంకుస్థాపన చేశారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ భవన సముదాయానికి శంకుస్థాపన చేసిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఎనిమిదంతస్థులతో శీతలీకరణ సదుపాయంతో నిర్మించనున్న ఈ యూనిటి మాల్‌లో రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఉత్పత్తి చేస్తున్న చీరలు, దుస్తులు, ఖద్దరు తదితర చేనేత వస్త్రాలు, పట్టు వస్త్రాలను విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ యూనిటి మాల్ దిగువ రెండు అంతస్థుల్లో 323 కార్లు పార్కింగ్ చేసేలా పార్కింగ్ సదుపాయం ఉంటుందన్నారు. దిగువ, మొదటి, రెండో అంతస్థుల్లో వివిధ జిల్లాలకు చెందిన 41 వస్త్ర దుకాణాలు. మూడో అంతస్థు నుంచి ఐదో అంతస్థు వరకూ ఇతర రాష్ట్రాలకు చెందిన 36 వస్త్ర దుకాణాలుంటాయని చెప్పారు. ఆరు, ఏడో అంతస్థుల్లో డిజైనింగ్ కేంద్రాలు, రంగుల ముద్రణశాల, ఎనిమిదో అంతస్థులో కో-ఆప్టెక్స్ కార్యాలయం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్.గాంధీ, పీకే శేఖర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ప్రజాపనుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, చేనేత, ఖద్దరు శాఖల కార్యదర్శి వి అముదవల్లి, కో-ఆప్టెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ జేకబ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖలో...

రాష్ట్ర పాడిపరిశ్రమ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో ఆ శాఖలో రూ.73.93 కోట్లతో పూర్తయిన 11 పథకాలను ప్రారంభించి రూ.15 కోట్లతో నిర్మించనున్న చేపలదిగుమతి కేంద్రానికి శంకుస్థాపన చేశారు. తూత్తుకుడి, తిరుచ్చి, విరుదునగర్, తిరుపత్తూరు, కృష్ణగిరి, ఈరోడ్, ధర్మపురం, కన్నియాకుమారి పూర్తయిన పథకాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనితా రాధాకృష్ణన్, ఆర్ఎస్ రాజకన్నప్పన్, మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి సత్యప్రసాద్ సాహు, ఆ శాఖ కమిషనర్ సున్‌సోంగం డైరీ అభివృద్ధి శాఖ సంచాలకులు ఎస్ వినీత్ తదితరులు పాల్గొన్నారు.

3 జిల్లాల్లో గృహసముదాయాలు...

రాష్ట్ర నగర శివారు నివాసాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సచివాలయంలో జరిగిన మరో కార్యక్రమంలో తిరునల్వేలి, దిండుగల్, నామక్కల్ జిల్లాల్లో రూ.327.69 కోట్లతో నిర్మించనున్న గృహసముదాయాలకు కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గృహవసతి, నగరశివారుప్రాంతాల అభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్ల ఉషా, రాష్ట్ర నగర శివారు నివాసాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకర్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే విజయకార్తికేయన్ పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ భవనాల ప్రారంభం..

రెవెన్యూ శాఖ తరఫున రూ.16.06 కోట్లతో నిర్మించిన రెండు సబ్ కలెక్టర్ కార్యాలయాలు, 25 ఆర్‌ఐ కార్యాలయాలతో కూడిన 25 సిబ్బంది క్వార్టర్స్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. మైలాడుదురై, నాగపట్టినంలో సబ్‌కలెక్టర్ కార్యాలయాలను రూ.8.58 కోట్లతో నిర్మించినట్లు మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తెలిపారు.

తాంబరంలో రూ.4కోట్ల స్వాధీనం కేసు పుదువై ఎంపీ విచారణ

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సమయంలో తిరునల్వేలిలో బీజేపీ తరఫున పోటీ చేసిన నయినార్ నాగేంద్రన్ కోసం తరలిస్తున్న రూ.4కోట్ల నగదు పట్టుబడిన కేసులో పుదుచ్చేరి ఎంపీని సీబీసీఐడీ పోలీసులు బుధవారం ఉదయం విచారణ జరిపారు. నగదు స్వాధీనం కేసుకు సంబంధించి ఇప్పటికే పలువురికి సమన్లు పంపించి వారి వద్ద సీబీసీఐడీ పోలీసులు విచారణ జరిపారు. ఈ నేపథ్యంలోనే పుదుచ్చేరి ఎంపీ సెల్వగణపతికి కూడా విచారణకు హాజరుకావాలంటూ సీబీసీఐడీ సమన్లు జారీ చేసింఇ. దాంతో సెల్వగణపతి కోరిన మూడు నెలల గడువు ఇటీవలే ముగిసింది. దీంతో ఎంపీ సెల్వగణపతిని బుధవారం ఉదయం సీబీసీఐడీ అధికారులు విచారణ జరిపారు. తాంబరం రైల్వేస్టేషన్‌లో నగదు స్వాధీనం కేసుకు సంబంధించి వారడిగిన ప్రశ్నలకు సెల్వగణపతి సమాధానాలిచ్చినట్లు సమాచారం. వీటన్నింటిని పోలీసులు రాతపూర్వకంగా నమోదుచేసుకున్నారు.



బ్రహ్మకుమారీస్ రిట్రీట్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన అఖిల భారత మహిళా సదస్సు బ్రోచెర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

రాజధానిలోనూ మహిళలకు భద్రత కరవు

- గవర్నర్ ఆవేదన

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలోనూ మహిళలకు భద్రత లేదని, మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉన్నా వారిపై లైంగిక వేధింపులు సర్వసాధారణమైపోయాయని గవర్నర్ ఆర్ఎన్ రవి ఆవేదన వ్యక్తం చేశారు. కాంచీపురం జిల్లా సుంకువారి సత్రంలో బుధవారం బ్రహ్మకుమారీస్ రీట్రీట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక అఖిల భారత మహిళా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన గవర్నర్ మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారన్నారు. ఇటీవల ఓ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో స్వర్ణపతకాలు అందుకున్న విద్యార్థినులతో తాను మాట్లాడగా.. ఎట్టి పరిస్థితుల్లో ఉన్నత చదువుల కోసం చెన్నై రామని చెబుతూ వారు కంట తడిపెట్టుకున్నారని చెప్పారు. చెన్నై వెళ్తే తమకు భద్రత ఉండదని తల్లిదండ్రులు వాపోతున్నట్లు తనకు తెలియజేశారన్నారు. ఇకనైనా రాజధాని నగరం మహిళలకు పటిష్ఠమైన భద్రతనిచ్చే విధంగా మారేందుకు తగు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఇదిలా వుండగా ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి సుమారు 500 మంది మహిళా ప్రతినిధులు హాజరయ్యారు.

సమాచార దర్శిని

రాజధాని కళాశాల తెలుగుశాఖలో నేడు క్విజ్ పోటీలు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనాతీరంలోని రాజధాని కళాశాల తెలుగు శాఖలో గురువారం అంతర్ కళాశాలల పోటీలు జరుగనున్నాయి. ఈ కళాశాలలో పని చేసిన పరవస్తు చిన్నయసూరి పేరిట 'నేటి విద్యార్థులకు స్వదేశీ విద్య అవసరమా? విదేశీ విద్య అవసరమా?' అనే అంశంపై, కందుకూరి వీరేశలింగం పంతులు పేర 'నువ్వు మెచ్చిన ప్రబంధ కవి', అనే అంశంపై వక్తృత్వ పోటీలు, కొక్కొండ వెంకటరత్నం పంతులు పేర క్విజ్ పోటీలు జరుగనున్నాయి. నగరంలోని ఔత్సాహిక విద్యార్థులంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ ఎన్.ఎలిజబెత్ విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.

నేటినుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31వ తేది రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు ఇవ్వనున్నారు. ఆ ప్రకారం, ఒక రిజిస్ట్రార్ ఉండే కార్యాలయాల్లో అందించే 100 టోకెన్లకు బదులుగా 150, ఇద్దరు రిజిస్ట్రార్లుండే కార్యాలయాల్లో 200లకు బదులుగా 300 టోకెన్లు ఇవ్వనున్నారు. అలాగే, అధిక రిజిస్ట్రేషన్లు జరిగే 100 కార్యాలయాల్లో యధావిధిగా అందించే 100కు బదులు 130 టోకెన్లు అందించనున్నారు. అలాగే, తాత్కాల్ ప్రతిపాదికిన అందిస్తున్న 12కు అదనంగా 4 టోకెన్లు అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

5 నుంచి తిరునల్వేలిలో సీఎం పర్యటన

● మాంజోలై తోట కార్మికులతో భేటీ

పెరంబూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఫిబ్రవరి 5,6 తేదీల్లో తిరునల్వేలి జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేలా సీఎం స్టాలిన్, అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఫిబ్రవరి 5,6 తేదీల్లో తిరునల్వేలి జిల్లాల్లో పర్యటించనున్న సీఎం, పలు శాఖల తరపున లబ్దిదారులకు సంక్షేమ సహాయాల పంపిణీ, కొత్త పథకాలకు శంకుస్థాన చేయనున్నారు. పర్యటనలో భాగంగా మాంజోలై తేయాకు తోటల కార్మికులు, మత్స్యకారులతో సీఎం సమావేశం కానున్నారని మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు.

● మహా కుంభాభిషేకం ఎఫెక్ట్

చెన్నై-ప్రయాగ్‌రాజ్ విమాన ఛార్జీ రూ.59 వేలు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభాభిషేకం ఈ నెల 13న ప్రారంభమై 45 రోజులు జరుగనుంది. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఈ కారణంగా ప్రధాన నగరాల నుంచి ప్రయాగ్‌రాజ్‌కు నడిపే విమానా ఛార్జీలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. ఆ ప్రకారం, చెన్నై నుంచి విమాన ఛార్జీ పెరిగింది. ఆ ప్రకారం, అమావాస్య రోజైన బుధవారం నుంచి మూడు రోజులు చెన్నై నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లే విమాన టిక్కెట్ల ధరలు రూ.59వేలకు పెరిగాయి.

న్యాయస్థానాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

● రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచన

పెరంబూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 179 న్యాయస్థానాల ప్రాంగణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.20 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు లేఖ రాసింది. న్యాయవాదులకు తగిన భద్రత కల్పించాలని కోరుతూ తమిళనాడు-పుదుచ్చేరి బార్ కౌన్సిల్ మద్రాసు హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలుచేసింది. ఈ కేసు మంగళవారం విచారణకు రాగా, న్యాయస్థానాల్లో భద్రత కల్పించేలా 7,800 సీసీ కెమెరాలు, మానిటర్లు ఏర్పాటుచేయనున్నట్లు, అందుకు రూ.20 కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు రిజిస్ట్రేషన్ శాఖ హైకోర్టుకు తెలిపింది. కేసు విచారించిన హైకోర్టు, నిధుల కేటాయింపుపై సత్వరం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

రేపు 1,220 ప్రత్యేక బస్సులు

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): శుభ ముహూర్తం, వారాంతపు సెలవులను పురస్కరించుకొని కిలాంబాక్కం, కోయంబేడు, మాధవరం బస్ టెర్మినళ్ల నుండి రాష్ట్రంలోని పలుజిల్లాలకు వెళ్లే ప్రయాణికుల కోసం వచ్చే శుక్రవారం 1,220 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తమిళనాడు స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, సెలవు రోజుల్లో సొంతూళ్లకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం కిలాంబాక్కం నుండి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, కోయండత్తూరు, సేలం, తిరుప్పూర్ ప్రాంతాలకు శుక్రవారం 365, ఫిబ్రవరి 1వ తేదీ శనివారం 445 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు. కోయంబేడు నుంచి తిరువణ్ణామలై, వెల్లయంగిరి, హోసూర్, బెంగుళూరు ప్రాంతాలకు శుక్రవారం 60, ఫిబ్రవరి 1వ తేదీ 60 బస్సులు నడపనున్నట్లు తెలిపారు. బెంగుళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోయంబత్తూరు ప్రాంతాల నుండి రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు అదనంగా 250 బస్సులను నడపనున్నట్లు వివరించారు. మాధవరం నుండి ఈ రెండ్రోజుల్లో మొత్తం 40 బస్సు సేవలు అందుబాటు ఉంటాయన్నారు. వచ్చే ఆదివారం సొంతూళ్ల నుండి నగరానికి, బెంగుళూరుకు తిరిగొచ్చే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సులు నడిపేందుకు టైంటేబుల్ సిద్ధంచేసినట్లు మోహన్ తెలిపారు.

● ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నిక

ఈవీఎంలపై చిహ్నాల ఏర్పాటు





ఎన్నికల సిబ్బందిని తనిఖీ చేస్తున్న పోలీసులు - ఈవీఎంలో చిహ్నాలు అమరుస్తున్న సిబ్బంది

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికకు వారం రోజులే ఉండటంతో ఎన్నికల అధికారులు బుధవారం ఈవీఎంలపై చిహ్నాలు అతికించే పనులను ప్రారంభించారు. ఈ నెల 5న ఈనియోజకవర్గం ఉపఎన్నిక జరుగనుంది. ఈ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి సీతాలక్ష్మి మధ్యే గట్టిపోటీ నెలకొంది. వీరిరువురితోపాటు 44మంది ఇండిపెండెంట్లు కూడా పోటీచేస్తున్నారు. ఈరోడ్ కార్పొరేషన్ కార్యాలయంలో భద్రపరచిన ఈవీఎంలపై అభ్యర్థుల చిహ్నాలను అతికిస్తున్నారు. ఈ పనులకు వెళ్లే సిబ్బందిని. అభ్యర్థుల తరపు ఏజెంట్లను పోలీసులు తనిఖీ చేసి పంపారు. ఈ ఎన్నికలకు 234 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి 284 ఈవీఎంలను ఉపయోగించనున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి.

పతకాలు సాధించినా ఫలితం శూన్యం

● బధిరుల విభాగం క్రీడాకారుల ఆవేదన



చెన్నై ప్రెస్‌క్లబ్‌లో బధిర క్రీడాకారులు

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పారాలింపిక్ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించినా తమను రాష్ట్రప్రభుత్వం గుర్తించలేదని బధిరుల విభాగం క్రీడాకారులు ఆవేదన వ్యక్తంచేశారు. గత ఏడాది డిసెంబరు 1 నుంచి 8వతేదీ వరకు 10వ ఆసియా పసిఫిక్ బధిరుల పారాలింపిక్ పోటీలు మలేసియాలో జరిగియి. ఇందులో 21 దేశాలకు చెందిన జట్లు పాల్గొనగా, భారత్ ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ పోటీల్లో పలు విభాగాల్లో చెన్నై, కన్నియాకుమారి, కడలూరు, సేలం, ఈరోడ్, తిరుచ్చి, తేని, విల్లుపురం జిల్లాలకు చెందిన ప్రియాంక, శుభశ్రీ, హరిణి, సమీహా పర్వీన్, మణికంఠన్, రాకప్పన్, వినీత్, సుదన్, కార్తిక్, సంతను రవి, యాసిన్, తదితరులు సత్తాచాటి మొట్టమొదటిసారిగా 6 బంగారు, 6 వెండి, 4 కాంస్య పతకాల సహా మొత్తం 11 పతాకాలు సాధించి అటు దేశానికి,ఇటు రాష్ట్రానికి ఘనత తెచ్చారు. ఈ నేపథ్యంలో చేపాక్‌లో ఉన్న చెన్నై ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఈ క్రీడాకారులు మీడియా ముందు తమగోడు వెళ్లబుచ్చుకున్నారు. దేశం, రాష్ట్రం కోసం క్రీడాపోటీల్లో పాల్గొని పతకాలు సాధించి ఘనత చేకూర్చిన తమకు రాష్ట్రప్రభుత్వం శుభాకాంక్షలు కూడా తెలియజేయకపోవడం బాధాకరమన్నారు.రాష్ట్రప్రభుత్వం తమను పట్టించుకోవట్లేదని, జాతీయస్థాయిలో గెలుపొందుతున్న సహక్రీడాకారులకు ఇస్తున్న ప్రోత్సాహక నిధులను తమకు ఇవ్వడంలేదని వారు వాపోయారు. పేద కుటుంబాలకు చెందిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, క్రీడాభివృద్ధి శాఖా మంత్రిని కలుసుకునేందుకు తమకు అవకాశం కల్పించాలని బధిర క్రీడాకారులు విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా తమిళనాడు క్రీడల అభివృద్ధి కమిషన్ మెంబర్ సెక్రెటరీ మేఘనాథరెడ్డి బధిర క్రీడాకారుల ఆరోపణలపై స్పందించారు. క్రీడాకారులు విదేశాల్లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు అయ్యే ఖర్చుఅంతా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. బధిర క్రీడాకారులు మలేసియాలో తగిన పోటీల్లో పతకాలు సాధించి రాష్ట్రానికి తిరిగొచ్చారని, అయినా వారికి ధ్రువపత్రాలు ఇప్పటివరకు అందలేదని, అవి వచ్చాక ప్రభుత్వం తరుపున సహాయం చేస్తామన్నారు. ఆ క్రీడాకారులు ఇప్పటివరకు తమ కార్యాలయానికి వచ్చి తనను సంప్రదించలేదని ఆయన తెలిపారు.

పౌష్టికాహార పథకం ఉద్యోగుల దీక్ష



చేపాక్ ప్రభుత్వ అతిథి గృహం ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన డిమాండ్లను ఆమోదించాలని కోరుతూ చేపాక్ అతిథిగృహం ఎదుట పౌష్టికాహార పథకం ఉద్యోగులు సిబ్బంది బుధవారం ఉదయం నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వ పౌష్టికాహార పథకం కేంద్రాల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, బడిపిల్లల అల్పాహార పథకం అమలు బాధ్యతను తమకే అప్పగించాలని డిమాండ్ చేస్తూ 24 గంటల నిరాహార దీక్షను ప్రారంభించిన పౌష్టికాహార పథకం ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ఆర్ కళా తెలిపారు. కార్యదర్శి జెస్సీ, పెరియసామి, అన్నాదురై, తమిళరసన్, మంజుల, వాసుకి, కర్పగం, సుమతి, మహేశ్వరి, పాండీ సెల్వి, లతా, నిర్మలా తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

శరణార్థుల కోసం గృహాలు

● తిరుచ్చిలో ఉదయనిధి శంకుస్థాపన

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలో వున్న శ్రీలంక శరణార్థ శిబిరంలో శాశ్వత గృహ నిర్మాణం కోసం ఉపముఖ్యమంత్రి ఉదయనిధి శంకుస్థాపన చేశారు. తిరుచ్చి పొట్టపట్టులో శిథిలావస్థకు చేరిన శరణార్థుల శిబిరం భవనం స్థానంలో రూ.41 కోట్లతో కొత్తగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం తిరుచ్చి వైర్‌లెస్ రోడ్డులో స్థలాన్ని ఎంపిక చేశారు. అక్కడ ఉదయనిధి బుధవారం శంకుస్థాపన చేశారు. 1983లో శ్రీలంకలో జరిగిన ఘర్షణల అనంతరం అక్కడి తమిళులు శరణార్థులుగా రాష్ట్రానికి వచ్చారు. వారి కోసం అప్పట్లో 104 శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటిల్లో సుమారు 57 వేల మంది తల దాచుకుంటున్నారు. అలాగే తిరుచ్చి సమీపంలోని పొట్టపట్టులోనూ శిబిరం ఏర్పాటైంది. తిరుచ్చి-పుదుకోట జాతీయ రహదారిలో వున్న ఈ శిబిరంలో 1250 మందికి పైగా శరణార్థులున్నారు. వీరి కోసం 488 గృహాలు 30 ఏళ్ల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఇవన్నీ శిథిలావస్థకు చేరడంతో కొత్తగా ఇళ్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇక్కడ ఉదయనిధి శంకుస్థాపన చేయడంతో పనులు ప్రారంభం కానున్నాయి.

సైన్స్ సదస్సులో ఉపాధ్యాయులకు జ్ఞాపికలు



వేలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం 32వ చిన్నారుల సైన్స్ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షురాలు అముద అధ్యక్షత వహించగా, కార్యదర్శి జనార్థనన్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిధిగా హాజరైన వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ఉపాధ్యక్షుడు జనార్థనన్ సదస్సు ప్రారంభించి, పత్ర సమర్పణ చేసిన పదిమంది విద్యార్థులు, ప్రభుత్వం గుర్తించిన ఉత్తమ ఉపాధ్యాయులకు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా పది మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

174 మందికి రూ.1.57 కోట్ల సహాయం



వేలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కేవీ కుప్పం సమీపంలోని కొసవన్ పుదురూలో బుధవారం జరిగిన వినతిపత్రాల స్వీకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి వివిధ విభాగాలకు చెందిన అధికారులు కూడా హాజరై, స్వయంగా వినతులను పరిష్కరించేందుకు యత్నించారు. ఈ సందర్భంగా 174 మంది లబ్దిదారులకు రూ.1.57 కోట్ల విలువైన వివిధ పథకాలను కలెక్టర్ పంపిణీ చేశారు.

అద్దె చెల్లించని దుకాణాలకు దేవాదాయ శాఖ సీలు

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజికరై ప్రాంతంలోని ఏకాంబరేశ్వరాలయానికి సక్రమంగా అద్దె చెల్లించని 40 దుకాణాలకు హిందూ దేవాదాయ శాఖ అధికారులు బుధవారం పోలీసు భద్రత నడుమ సీలు వేశారు. ఏకాంబరేశ్వరాలయానికి చెందిన స్థలంలో వస్త్ర, నగలు, పూజా సామగ్రి, పూలు, పండ్లు విక్రయించే 40కి పైగా దుకాణాలున్నాయి. వీటిని అద్దెకు తీసుకున్న వ్యాపారులు గత 5ఏళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో వారికి హిందూ దేవాదాయ శాఖ అధికారులు పలుమార్లు నోటీసులు పంపించారు. అలాగే దేవాదాయ శాఖ తరుపున కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు 5ఏళ్లుగా రూ.5కోట్లు అద్దె చెల్లించలేదని, వారిని దుకాణాలు ఖాళీ చేయించేలా ఉత్తర్వులు జారీచేయాలని న్యాయస్థానాన్ని కోరారు. మంగళవారం దేవాదాయ శాఖ పిటిషన్‌పై విచారణ జరిపే న్యాయస్థానం ఆ శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీనితో బుధవారం ఉదయం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ భారతీరాజా నేతృత్వంలోని అధికారుల బృందం ఏకాంబరేశ్వరాలయానికి పోలీసుల బందోబస్తుతో వెళ్లారు. దుకాణాలకు సీలు వేసేందుకు యత్నించిన అధికారులతో వ్యాపారులు వాగ్వివాదానికి దిగారు. జోక్యంచేసుకున్న పోలీసులు వ్యాపారులకు కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. దీంతో అధికారులు 40 దుకాణాలకు సీలు వేసి, హెచ్చరిక నోటీసులు అంటించారు.

ఘనంగా వేలూరు టోల్‌గేట్ రైతు బజారు సిల్వర్ జూబ్లీ వేడుకలు



వేలూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వేలూరు టోల్‌గేట్‌లో వున్న రైతు బజారు సిల్వర్ జూబ్లీ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. 2000 జనవరి 29న నాటి ముఖ్యమంత్రి కరుణానిధి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ రైతుబజారుకు ఎన్నో విశేషాలున్నాయి. ఇక్కడ 509 మంది రైతులు కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్నారు. రోజుకు రూ.13 లక్షలకు పైగా కూరగాయలు, పండ్లు విక్రయాలు జరుగుతున్నట్లు అధికారుల అంచనా. బుధవారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా రూ.50వేల విలువైన ఎరువులు, విత్తనాలను ముగ్గురు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, కౌన్సిలర్ అరుణ పాల్గొన్నారు.

రాణీపేట జిల్లాలో పంచలోహ విగ్రహాలు లభ్యం



లభ్యమైన దీపాలనాయకి అమ్మవారి విగ్రహాలు

పెరంబూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాణీపేట జిల్లా షోళింగర్ సమీపంలోని చెరుకు తోటలో రెండు పంచలోహ విగ్రహాలను అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పులియమంగలం గ్రామంలో ఓ రైతుకు చెందిన చెరకు తోటలో పంట కోత పనులు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం కార్మికులు కోత కోస్తుండగా, తోట మధ్యలో రెండడుగుల ఎత్తున్న రెండు దీపాలనాయకి అమ్మవారి విగ్రహాలను గుర్తించారు. ఈ విషయాన్ని వీఏవో తరణిహరికి తెలియజేయగా, ఆయన షోళింగర్ తహసీల్దార్ సెల్వి, రెవెన్యూ అధికారి గోకులకృష్ణన్‌కు సమాచారం ఇచ్చారు. అధికారులు తోట వద్దకు చేరుకొని విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. ఆలయం నుంచి వీటిని దొంగిలించి తోటలో పడేశారా? అలా కాకుండా ఈ తోటలోకి విగ్రహాలు ఎలా వచ్చాయి? అనే కోణాల్లో షోళింగర్ పోలీసులు విచారణ చేపట్టారు.

'నాన్ ముదల్వన్' కింద పాలిటెక్నిక్‌లలో కొత్త కోర్సులు

● ఉపాధ్యాయులకు ముగిసిన శిక్షణ

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నాన్ ముదల్వన్ పథకం కింద పాలిటెక్నిక్ కళాశాలల్లో 2024-25 ఏడాదికి గాను కొత్త కోర్సులను ప్రవేశపెడుతున్నారు. ఇందుకోసం అధ్యాపకులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. చెన్నై తరమణి సెంట్రల్ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఎలక్ట్రానిక్ వెహికల్ టెక్నాలజీ' పేరుతో ఆరు రోజుల శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల నుంచి 59 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ విభాగాలకు చెందిన అధ్యాపకులు హాజరయ్యారు. ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు ఈ శిక్షణా శిబిరం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్న ప్రాంతాల వివరాలు ...

నంగనల్లూరు: బీవీ నగర్, ఎంజీఆర్ రోడ్డు, కనకాంబాళ్ కాలనీ, విశ్వనాథపురం, హిందూ కాలనీ, ఎన్‌జీవో కాలనీ, టీచర్స్ కాలని, కేకే నగర్, ఎస్‌బీఐ కాలనీ ఎక్స్‌టెన్షన్, ఎస్‌బీఐ కాలనీ మెయిన్ రోడ్డు, ఏజీఎస్ కాలనీ, దురైస్వామి గార్డెన్, హండ్రెడ్‌ఫీట్ రోడ్డులో కొంత భాగం, సివిల్ ఏవియేషన్ కాలనీ, అయ్యప్ప నగర్, కన్నికా కాలనీ, లక్ష్మీనగర్‌లోని కొంత భాగం, ఎస్‌బీఐ కాలనీ 3వ వీధి, టీఎన్‌జీవో కాలనీ, జయంతి నగర్, ఉళ్లగరం, ఆళ్వార్‌నగర్ 46వ వీధి, మేక్ మిలన్ కాలనీ, పెరుమాళ్ నగర్, ఎస్‌బీఐ కాలనీ 3వ స్టేజ్, 1, 2, 4వ మెయిన్ రోడ్డులో 43 నుంచి 48వ వీధి వరకు, నెహ్రూ కాలనీ 5వ మెయిన్‌రోడ్డులో 39 నుంచి 42వ వీధి వరకు, కన్నయ్య వీధి, కుళక్కరై వీధి, కపిలర్ వీధి, కాలేజ్ రోడ్డు, వేంబులియమ్మన్ వీధి 4వ మెయిన్‌రోడ్డు, హిందూ కాలనీలోని కొంత భాగం, జోసఫ్ వీధి, కుప్పుస్వామి వీధి, గోవిందస్వామి వీధి, గాంధీరోడ్డు, ఎల్లై ముత్తమ్మన్‌వీధి, కుమరన్ వీధి, చర్చి వీధి, కృష్ణస్వామి వీధి, మూవరసన్‌పేటలో కొంత భాగం, పల్లవన్‌తాంగల్‌లో కొంత భాగం.

పోరూర్: సేక్కిళార్ నగర్, ఏరిక్కరై రోడ్డు, మలయంబాక్కం దురైస్వామి రోడ్డు, జయం నగర్, దేవి కరుమారియమ్మన్ నగర్, తిరువళ్లువర్ నగర్, పిన్నియమ్మన్ కోయిల్ వీధి, తిరునాగేశ్వరన్ కాలనీ, మంగళ నగర్, శక్తినగర్, మౌంట్ పూందమల్లిరోడ్డులో కొంత భాగం, కావ్య గార్డెన్, గణేశ్ అవెన్యూ.

మాంగాడు: కుండ్రత్తూరు మెయిన్‌రోడ్డు, వల్లీశ్వరర్‌కోయిల్ వీధి, ఎస్ఎస్ కోయిల్ వీధి, స్కూలు వీధి, ఎంజీఆర్ నగర్, వెళ్లీశ్వరర్ నగర్, తూర్పు కామాక్షి నగర్, నరివనం రోడ్డు, రామకృష్ణ అంబాళ్ నగర్, అడిశన్ నగర్, బాలాజీ అవెన్యూ, అంబా నగర్, పాండ్యన్ నగర్.

కోవూర్: తంగం అవెన్యూ, మూకాంబిగై నగర్, ఈశ్వర్ నగర్, వీఎస్ నగర్, పొన్నియమ్మన్ నగర్, సాయి నగర్, తిల్లై నటరాజ నగర్, మదుర గార్డెన్

తిరుముడివాక్కం: ఎరుమయూర్, క్రషర్ ప్రాంతం, కిష్కింద మెయిన్‌రోడ్డు, రాజీవ్‌నగర్.

మాడంబాక్కం: పూమాలై రామర్ కోయిల్, మప్పేడు, టీపీ కాలనీ, మురుగన్ అవెన్యూ, రూబీ విల్లా, శ్రీ సాయి అవెన్యూ, వెంగంబాక్కం మెయిన్‌రోడ్డు, ఎస్‌పీ అవెన్యూ, అశోక్‌నగర్, ఏకేబీ గ్రీన్ ఫీల్డ్స్.

తిరువేర్కాడు: శివన్‌కోయిల్ వీధి, దేవి నగర్, కేపీఎస్ నగర్, వెంకటేశ్వర నగర్, అభిరామి నగర్, ఆనంద్ నగర్, అరవింద్ నగర్, మురుగన్ నగర్, కస్తూరిబాయ్ నగర్, ఎల్లయమ్మన్‌కోయిల్, కస్తూరి అవెన్యూ.

తిరుముల్లైవాయల్: భారతినగర్, రాంజమాజి నగర్, వెళ్లనూరు కృష్ణ కాలువ, అరిక్కంబేడు, కొళ్లుమేడు, నవశక్తి నగర్, లక్ష్మీనగర్ ఎక్స్‌టెన్షన్.

న్యాయాధికారిపై చెప్పులు విసిరిన యువకుడు

● రాజ్‌భవన్‌పై పెట్రో బాంబు విసిరిందీ ఇతనే

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజ్‌భవన్‌పై పెట్రోల్ బాంబులు విసిరి, కటకటాల పాలైన యువకుడు.. తాజాగా ఆ కేసు దర్యాప్తు చేస్తున్న న్యాయాధికారిపై చెప్పులు విసిరాడు. వివరాలిలా వున్నాయి... రాజ్‌భవన్‌పై 2023 అక్టోబరు 28వ తేదీ ఓ యువకుడు పెట్రోల్ బాంబు వేసిన విషయం తెలిసిందే. పోలీసులు అతనిని అరెస్టు చేసి నందనంకు చెందిన గరుక్కా వినోద్‌గా గుర్తించారు. అతనిపై అనేక కేసులున్నట్లు తేలింది. రౌడీగా చెలామణి అవుతున్న అతడి నుంచి పెట్రోల్ బాంబులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు గూండా చట్టం ప్రయోగించారు. కేసు తీవ్రత గ్రహించిన ప్రభుత్వం దర్యాప్తును ఎన్ఐఏకు బదిలీ చేసింది. దాంతో ఆ కేసు విచారణ ఎన్ఐఏ కోర్టులో జరుగుతోంది. ఈ నేపథ్యంలో పూందమల్లి ప్రత్యేక కోర్టులో మంగళవారం విచారణ జరగ్గా.. ఆ సమయంలో వినోద్ తన కాలి చెప్పులను న్యాయాధికారిపైకి విసిరాడు. అందులో ఒక చెప్పు జడ్జి సమీపంలో, మరొకటి టేబుల్‌పై పడ్డాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వినోద్‌ను బయటకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వినోద్ తనను విడుదల చేయాలంటూ కేకలేశాడు. అనంతరం పోలీసులు వినోద్‌ను పుళల్ జైలుకు తరలించారు. రాజ్‌భవన్‌పై పెట్రోల్ బాంబు విసిరిన కేసు విచారణ పూర్తి కావచ్చింది. త్వరలోనే తీర్పు కూడా వెలువడే అవకాశలున్న నేపథ్యంలో.. వినోద్ న్యాయాధికారిపై చెప్పులు విసరడం గమనార్హం.

కోవైలో నగ్నంగా పరిగెత్తిన ఉత్తరాది యువకుడు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు ఆర్ఎస్ పురంలో నగ్నంగా పరుగులు పెట్టిన ఓ ఉత్తరాది యువకుడిపై స్థానికులు దాడి చేశారు. అయితే అతని మానసిక స్థితి సరిగ్గా లేదని తేలడంతో పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఆర్ఎస్ పురంలో మంగళవారం సాయంత్రం 30 ఏళ్ల యువకుడు దుస్తులు విప్పేసి, పెద్దగా కేకలేస్తూ వీధుల్లో పరుగులుతీశాడు. దీంతో స్థానికులు ఆ యువకుడిని పట్టుకుని స్తంభానికి కట్టేసి కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు.. అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన ఆ యువకుడిని ఆస్పత్రిలో చేర్పించారు. అతడి మానసిక పరిస్థితి సరిగ్గా లేదని గ్రహించి మానసిక చికిత్సా కేంద్రానికి తరలించారు.

కొండితోపులో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొండితోపులోని పోలీసు క్వార్టర్స్‌లో నివశిస్తున్న మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా వున్నాయి... జైలా (44) అనే కానిస్టేబుల్ ఆర్‌కే నగర్ పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసేది. ఆమె భర్త ప్రభాకరన్ ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం విధుల నుంచి ఇంటికొచ్చిన జైలా. బెడ్‌రూంలోకి వెళ్లి తలుపేసుకుంది. చాలా సేపటి వరకూ ఆమె బయటకు రాకపోవడంతో అనుమానించిన ప్రభాకరన్.. ఆమెను పిలిచాడు. స్పందన లేకపోవడంతో గది తలుపులు పగులగొట్టి లోనికెళ్లగా అప్పటికే జైలా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్టాన్లీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో వుంది.

టీచర్‌పై లైంగికవేధింపులు.. సహ ఉపాధ్యాయుడి అరెస్ట్

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యాసార్పాడిలోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌పై లైంగికవేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. వ్యాసార్పాడిలో ఉన్న కార్పొరేషన్ మహోన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ విధానంలో ఓ మహిళా టీచర్ పనిచేస్తున్నారు. 26వతేదీ రిపబ్లిక్ డేను పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలో జెండా ఆవిష్కరణ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రదర్శలో ఉంచిన వ్యాయామ పరికరాలను ఆ ఉపాధ్యాయని ప్రత్యేక గదిలో భద్రపరుస్తున్నారు. అదే పాఠశాలలో వ్యాయామ టీచర్‌గా పనిచేస్తున్న కొలత్తూర్ పుత్తగం లక్ష్మీఅమ్మన్‌నగర్‌కు చెందిన అరివలగన్ (53) గదిలో ఒంటరిగా ఉన్న టీచర్‌పై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటనపై బాధితురాలి భర్త ఎంకేబీనగర్ మహిళా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి అరివలగన్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ప్రయాణికుడి నుంచి జీపీఎస్ పరికరం స్వాధీనం

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ వెళ్లేందుకు విమానాశ్రయానికి వచ్చిన ప్రయాణీకుడి నుంచి కస్టమ్స్ అధికారులు జీపీఎస్ పరికరం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం విమానాశ్రయానికి వచ్చిన చెన్నైకి చెందిన శంకర్‌ను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయగా.. హ్యాండ్ బ్యాగులో జీపీఎస్ పరికరం బయల్పడింది. దానిని స్వాధీనం చేసుకున్న అధికారులు.. శంకర్‌ను అదుపులోకి తీసుకుని, పోలీసులకు అప్పగించారు. అయితే తన వద్ద వున్న జీపీఎస్ పరికరానికి అనుమతి వుందని, కానీ విమానంలో తీసుకెళ్లకూడదన్న విషయం తనకు తెలియదని శంకర్ చెప్పడంతో ఆ వివరాలను నమోదు చేసుకున్న పోలీసులు.. అతనిని వదిలేశారు.

మండపం వద్ద రూ.60 లక్షల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో కోస్టుగార్డు సిబ్బంది

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా మండపం వద్ద భారత కోస్టుగార్డు సిబ్బంది జరిపి తనిఖీల్లో రూ.60 లక్షల విలువైన గంజాయి పట్టుబడింది. ముందస్తు సమాచారం మేరకు కోస్టుగార్డు సిబ్బంది అంతర్జాతీయ సరిహద్దు జలాల్లో తనిఖీలు చేపట్టారు. సరిహద్దు జలాల్లోని ఓ చిన్నదీవిలో తనిఖీలు చేసిన కోస్టుగార్డు సిబ్బంది 12 ప్యాకెట్లను గుర్తించారు. వాటిని తనిఖీ చేయగా, మొత్తం 53 కిలోలకు పైగా గంజాయి బయల్పడింది. వాటిని స్వాధీనం చేసుకున్న కోస్టుగార్డు సిబ్బంది.. తీరప్రాంత అధికారులకు అప్పగించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.60 లక్షలు వుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రసవంపై గర్భిణులకు అవగాహన

● కస్తూర్బా గాంధీ ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు ఏర్పాటు



గర్భిణులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్న వైద్య సిబ్బంది

పెరంబూర్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రసవం భయం పోగొట్టేలా కస్తూరిబాయ్ గాంధీ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ప్రత్యేక ప్రసవ వార్డు ఏర్పాటైంది. దేశంలోనే తొలిసారిగా ట్రిప్లికేన్‌లోని కస్తూర్బా గాంధీ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో, గర్భిణులకు ప్రసవంపై ఉన్న భయాందోళనలు నివృత్తి చేసేలా, సుఖప్రసవం జరిగేలా ప్రత్యేక ప్రసవ వార్డు ఏర్పాటైంది ఈ వార్డులో యోగా, సంగీతం సహా పలు శిక్షణలు అందజేసి, గర్భిణుల్లో నెలకొన్న భయాందోళనలు పోగొట్టేలా చర్యలు చేపట్టినట్లు ఆసుపత్రి డైరెక్టర్ మహాలక్ష్మి తెలిపారు.

ఆస్ట్రేలియా ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌గా పృథ్వీ



చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ సింగిల్స్ ఛాంపియన్‌షిప్ బధిరుల విభాగంలో ఐసీఎఫ్ ఉద్యోగి ఎస్.పృథ్వీ విజేతగా నిలిచారు. అతను ఈ టైటిల్ సాధించడం ఇది వరుసగా రెండోసారి కావడం విశేషం. పృథ్వికి ఐసీఎఫ్ ఉద్యోగులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



'పార్కింగ్' డైరెక్టర్ దర్శకత్వంలో శింబు

సమాజంలోని ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే పార్కింగ్ సమస్యను ప్రధానాంశంగా ఎంచుకుని 'పార్కింగ్' పేరుతో బ్లాక్‌బస్టర్ మూవీని అందించిన యంగ్ డైరెక్టర్ రామ్‌కుమార్ బాలకృష్ణన్ హీరో శింబు చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. రామ్‌కుమార్ చెప్పిన కథ నచ్చడంతో హీరో ఓకే చెప్పారు. ఈ సినిమా డాన్ పిక్చర్స్ పతాకంపై నిర్మితంకానుంది.శింబు పుట్టిన రోజు సందర్భంగా ఈ కొత్త మూవీని అధికారికంగా ప్రకటించాలని భావిస్తున్నారు. ఇదిలా వుండగా శింబు ప్రస్తుతం 'థగ్‌లైఫ్' అనే మూవీలో నటించారు. ఇపుడు ఏజీఎస్ నిర్మాణ సంస్థ నిర్మించే మూవీలో శింబు నటించనున్నారు. ఈ మూవీకి అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహించనున్నారు. ప్రస్తుతం ఈ డైరెక్టర్ 'డ్రాగన్' పేరుతో ప్రదీప్ రంగనాథన్ హీరోగా ఓ మూవీ రూపొందిస్తున్నారు. ఈ సినిమా తర్వాత రామ్‌కుమార్ డైరెక్షన్‌లో శింబు నటించనున్నారు.

కార్తి సరసన ముచ్చటగా మూడోసారి


రజీషా విజయన్

మలయాళ భామ రజీషా విజయన్ హీరో కార్తితో ముచ్చటగా మూడోసారి జతకట్టనున్నారు. తమిళంలో 'కర్ణన్', 'సర్దార్', 'జై భీమ్' వంటి హిట్ చిత్రాల్లో నటించిన రజీషా... మంచి కథా పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ ముందుకుసాగుతున్నారు. ఈ నేపథ్యంలో కార్తి తో కలిసి మరోమారు నటించనున్నారు. లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కనున్న 'ఖైదీ-2'లో రజీషాను హీరోయిన్‌గా సెలెక్ట్ చేసేందుకు సంప్రదిస్తున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. 'సర్దార్' తొలిభాగంలో నటించగా, ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న 'సర్దార్' రెండో భాగంలోనూ రజీషా నటిస్తున్నారు. ఇపుడు 'ఖైదీ-2' కోసం ఆమెను ఎంపిక చేయనున్నారు. ఇప్పటివరకు రజీషా నటించిన తమిళ చిత్రాలన్నీ ఘన విజయాన్ని సాధించాయి. ఈ సెంటిమెంట్ కూడా 'ఖైదీ' సీక్వెల్ కోసం ఆమెను ఎంపిక చేయడానికి ముఖ్య కారణమని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

తమిళ చిత్రజ్యోతి

ట్రెండ్‌కు తగినట్టుగా సినిమాలు తీయలేరు

● గౌతం వాసుదేవ్ మేనన్

కోలీవుడ్‌లోని ప్రముఖ దర్శకులు మారి సెల్వరాజ్, పా.రంజిత్‌లపై మరో దర్శకుడు గౌతం వాసుదేవ్ మేనన్ సుతిమెత్తగా విమర్శలు గుప్పించారు. నేటి ట్రెండ్‌కు అనుగుణంగా వీరు సినిమాలు తీయలేరని, అందువల్లే 80 లేదా 90 దశకం నేపథ్యంలో సినిమాలు తీస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఇదే విషయంపై ఆయన మాట్లాడుతూ, 'మారి, రంజిత్ తీసే సినిమాల్లోని లోపాలను ఎత్తి చూపాలన్న ఉద్దేశం లేదు. కానీ, కులాన్ని ప్రధానాంశంగా తీసుకుని సినిమాలు తీసి, ప్రజలను రెండు వర్గాలుగా విభజించే చిత్రాలతో ఏకీభవించను. ఎందుకంటే కులం ఇపుడు లేదనేది ప్రతి ఒక్కరికీ తెలుసు. నేటి ట్రెండ్‌కు తగ్గట్టుగా వారు సినిమాలు తీయలేరు. అందుకే 80 లేదా 90 దశకంలో జరిగిన కథలతో సినిమాలు తీస్తున్నారు. ఇలాంటి కథలను తీసుకుని నేటి కాలానికి వివరించాల్సిన అవసరం లేదు' అని గౌతం వాసుదేవ్ మేనన్ అభిప్రాయపడ్డారు.




కృతికా ఉదయనిధి

కృతిక దర్శకత్వంలో కొత్త చిత్రం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సతీమణి, సినీ దర్శకురాలు కృతికా ఉదయనిధి మరో చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఇటీవల ఆమె దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'కాదలిక్క నేరమిల్లై'. రవి మోహన్, నిత్యా మేనన్ జంటగా నటించగా, తమ సొంత నిర్మాణ సంస్థ రెడ్ జెయింట్ మూవీస్ పతాకంపై తెరకెక్కింది. ఈ నేపథ్యంలో ఇపుడు మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనున్నట్టు ఆమె వెల్లడించారు. ఇదే విషయంపై కృతిక మాట్లాడుతూ, 'మళ్ళీ మరో చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నాను. కథ కూడా సిద్ధమైంది. దెయ్యం సినిమాలంటే నాకు అమితమైన ఇష్టం. సో.. దెయ్యం నేపథ్యంతో ఓ సినిమా తీయాలన్న కోరిక ఉంది. క్రైమ్, మాస్, థ్రిల్లర్ సినిమాలను రూపొందించాలని భావిస్తున్నాను. భవిష్యత్‌లో ఇలాంటి మూవీలను చూడొచ్చు. 'కాదలిక్క నేరమిల్లై'సినిమా ప్రేమ విఫలం నేపథ్యంలో రూపొందించాను. నేటి జనరేషన్ ప్రేమ, వారి మనస్తత్వాలను ప్రతిబింబింపజేసింది. రవి మోహన్ పూర్తి కథ చదివిన తర్వాతే అంగీకరించారు.కథ బాగా నచ్చడం వల్లే ఏఆర్.రెహ్మాన్ కూడా సంగీతం అందించేందుకు ముందుకు వచ్చారు. నా కొత్త ప్రాజెక్టు వివరాలను త్వరలోనే వెల్లడిస్తా'అని పేర్కొన్నారు.

విహంగాల సోయగాలు

పట్టినంబాక్కంలో కనువిందు చేస్తున్న విదేశీ పక్షులు










పట్టినంబాక్కం సముద్ర ప్రాంతంలో విహరిస్తున్న విదేశీ పక్షులు







స్థానిక మైలాపూర్ నియోజకవర్గ పరిధిలోని పట్టినంబాక్కం సముద్రతీరానికి వచ్చిన విదేశీ పక్షులు సందర్శకులను ఆహ్లాదపరుస్తున్నాయి. మంచు కురిసేవేళ పక్షుల కిలకిలారావాలతో పట్టినంబాక్కం, శ్రీనివాసపురం తీరాలు కొత్త అందాలు సంతరించుకున్నాయి. గత డిసెంబరు నుండి రాజధాని నగరంలో ఉష్ణోగ్రతలు తగ్గి చల్లటి వాతావరణం నెలకొంది. అలాగే ప్రస్తుతం మంచు కురుస్తుండడంతో విదేశీ పక్షులకు అనుకూల వాతావరణం ఏర్పడింది. దీంతో వివిధ జాతులకు చెందిన విదేశీ పక్షులన్నీ పట్టినంబాక్కం సముద్రతీర ప్రాంతాల్లో సేదదీరుతున్నాయి. విదేశీపక్షుల ఆగమనంతో వాటిని తిలకించేందుకు నగరవాసులతో పాటు శివారుప్రాంత ప్రజలు, పర్యాటకులు అక్కడికి పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

కొడైకెనాల్‌లో వికసించిన చెర్రీ పుష్పం



చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): 'పర్వత రాణి'గా ప్రసిద్ధి చెందిన కొడైకెనాల్‌లో 'చెర్రీ' పుష్పం వికసించింది. ఏడాదికొకమారు పూసే ఈ పుష్పాన్ని చూసేందుకు సందర్శకులు ఎగబడుతున్నారు. కొడైకెనాల్‌లో ప్రపంచంలోని అరుదైన పుష్పాలెన్నో వుంటాయి. మరీ ముఖ్యంగా శీతాకాలంలో ఇవి మరింత శోభాయమానంగా వుంటాయి. వీటిని వీక్షించేందుకే సందర్శకులు ఆ ప్రాంతానికి వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో కొడైకెనాల్‌లోని బ్రయంట్ పార్కులో వున్న చెర్రీ మొక్కలకు పుష్పాలు విరగబూశాయి. వీటిని చూసేందుకు ఎగబడుతున్న సందర్శకులు.. అక్కడే సెల్ఫీలు దిగుతుండడంతో రద్దీ నెలకొంటోంది.

రానున్న రెండేళ్లలో రూ.1000 కోట్ల పెట్టుబడి

● జీస్క్వేర్ ఎండీ బాల రామజయం



నూతన వెంచర్ ఆవిష్కరిస్తున్న బాల రామజయం

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సంస్థ కార్యకలాపాల విస్తరణలో భాగంగా వచ్చే రెండేళ్లలో రూ.1000 కోట్ల పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ సంస్థ, జీస్క్వేర్ మేనేజింగ్ డైరెక్టర్ బాల రామజయం పేర్కొన్నారు. బుధవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో నూతన వెంచర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం తాము తమ వినియోగదారుల విభిన్న నివాస ప్రాధాన్యతలకనుగుణంగా తమ వ్యాపారాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. వారు అపార్ట్‌మెంట్లు, విల్లాలు, ప్లాట్లను ఇష్టపడిన ప్రతి వ్యక్తికి వారి కలల ఇంటిని వారికి కావాల్సిన ఆకృతిలో అందించడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ విస్తరణ టైర్-1, 2, 3 నగరాలతో సహా అన్ని జోన్లకు విస్తరిస్తామని పేర్కొన్నారు.


తిరుప్పరంకుండ్రం ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న ప్రధానార్చకులు

తిరుప్పరంకుండ్రంలో తెప్పోత్సవాలు ప్రారంభం

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మురుగప్పెరుమాన్ కొలువైన ఆరుదివ్యక్షేత్రాలలో తృతీయ క్షేత్రం తిరుప్పరంకుండ్రం సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతియేటా ఈ ఆలయంలో తై మాసంలో పది రోజులపాటు తెప్పోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. ఆ మేరకు బుధవారం ఆలయంలో తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువజాము ఉత్సవర్ల సన్నిధిలో వేంచేసిన స్వామివారికి, దైవైనా అమ్మవారికి పంచామృతం సహా 16 రకాల సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆ తర్వాత ప్రత్యేక అలంకారంతో దైవానై సమేతుడై స్వామివారు కంబత్తడి మండపంలో వేంచేశారు. ఆ ప్రాంగణం వద్ద స్వర్ణ ధ్వజస్తంభంపై మంగళవాయిద్యాలు, శైవాగమ పండితుల మంత్రోచ్చారణ నడుమ ఆలయ ప్రధానార్చకులు పతకాన్ని ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని రోజూ స్వామి, అమ్మవార్లు స్వర్ణసప్పరం, స్వర్ణ మయూర వాహనం, హంసవాహనం, భూతవాహనం తదితర వాహనాల్లో ఊరేగనున్నారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన తెప్పోత్సవం ఫిబ్రవరి 7న జరుగనుంది.

బహుళ భాషల్లో 'ఉపనిషత్ గంగా'

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చిన్మయ మిషన్-సనాతన సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, ఆంగ్ల భాషల్లోకి అనువదించబడిన ప్రఖ్యాత 'ఉపనిషత్ గంగా' సిరీస్ విడుదలైంది. చెట్‌పేట్‌లోని చిన్మయా హెరిటేజ్ కేంద్రంలో, చిన్మయ మిషన్ గ్లోబల్ హెడ్ స్వామి స్వరూపానంద సమక్షంలో బుధవారం ఈ సిరీస్ ఆవిష్కృతమైంది. 2012లో దూరదర్శన్‌లో ప్రసారమైన ఉపనిషత్ గంగా ప్రేక్షకుల నుంచి ప్రశంసలందుకుంది. దాని కాలాతీత ప్రాముఖ్యతను గుర్తించి చిన్మయ మిషన్, సనాతన సేవా సంఘం దీనిని బహుళ భాషల్లోకి అనువదించేందుకు చొరవ తీసుకున్నాయి. భారత మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎస్.గోపాలస్వామి, తుగ్లక్ పత్రిక ఎడిటర్ ఎస్.గురుమూర్తి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఈ ధారావాహిక అనువాదాలను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఉపనిషత్ గంగా డైరెక్టర్ డాక్టర్ చంద్రప్రకాష్ ద్వివేది దంపతులు, మందిర కశ్యప్ ద్వివేది, డాక్టర్ మనీషా కమ్లానీ, సెంట్రల్ చిన్మయ ట్రస్టు సీఈవో గోపాల్ శ్రీనివాసన్ తదితరులు హాజరయ్యారు.


'ఉపనిషత్ గంగా' ఆవిష్కరణలో ప్రముఖులు

ఆది ద్రావిడులు, ఎస్టీల ప్రాంతాల్లో ఆలయాల మరమ్మతులకు ఆర్థిక సాయం



పల్లెగుడి మరమ్మతు కోసం నిర్వాహకుడికి రూ.2.50లక్షల చెక్కు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆదిద్రావిడ, షెడ్యూలు తెగలు అత్యధికంగా నివసించే గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల మరమ్మతులకు రూ.2.50లక్షల చొప్పున ముఖ్యమంత్రి స్టాలిన్ చెక్కులు పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 1250 పల్లె ఆలయాల మరమ్మతులకు రూ.2.50లక్షల చొప్పున ఇచ్చేందుకు ఇటీవలే ముఖ్యమంత్రి రూ.62.50 కోట్లు మంజూరు చేశారు. ఆ మేరకు సచివాలయం బుధవారం జరిగిన కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన 12 పల్లె గుడుల నిర్వాహకులకు తలా రూ.2.50 లక్షల చొప్పున చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు, తిరువణ్ణామలై ఆధీనం కుండ్రక్కుడ పొన్నంబళ అడిగళార్, పేరూరు ఆధీనం శాంతలింగ మరుదాచల అడిగళార్, మయిలం పొంబుర ఆధీనం శివజ్ఞాన బాలయస్వామి, సిరవై ఆధీనం కుమారగురుబరన్ స్వాములు, పర్యాటక, దేవాదాయ శాఖల ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి. చంద్రమోహన్, దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్ కార్యాలయాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

జేఎస్‌కే నాయుడికి ఉత్తమ భద్రతా అవార్డు



పురస్కారం అందుకుంటున్న నాయుడు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్ర కళాస్రవంతి' అధ్యక్షుడు జేఎం నాయుడి కుమారుడు, నేషనల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ జేఎస్‌కే నాయుడిని ఉత్తమ భద్రతా అవార్డు వరించింది. 'అసోసియేషన్ ఆఫ్ ప్రైవేటు సెక్యూరిటీ ఇండస్ట్రీ' ఆధ్వర్యంలో నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకులు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మాజీ డీజీపీ డాక్టర్ కె.జయంత్ మురళి ఈ పురస్కారాన్ని అందజేశారు. గతంలోనూ జేఎస్‌కే నాయుడు ఉత్తమ భద్రతా అవార్డును పలు సంస్థల ద్వారా అందుకోవడం విశేషం. ఈ పురస్కారం అందుకోవడం పట్ల నగరంలోని పలువురు తెలుగు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

మార్చి 14న కచ్చాదీవిలో ఆంథోనియర్ ఆలయ ఉత్సవాలు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం నుండి 12 నాటికల్ మైళ్ల దూరంలో భారత్, శ్రీలంక దేశాల నడుమనున్న కచ్చాదీవిలోని ఆంథోనియర్ ఆలయం వార్షికోత్సవాలు మార్చి 14న ప్రారంభమవుతున్నాయి. ఈ మేరకు శ్రీలంకలోని జాఫ్నా బిషప్ జోసెఫ్‌దాస్ జపరత్నం ఓ ప్రకటన వెలువరించారు. మార్చి 14న ఆలయం ఎదురుగా ఉన్న ధ్వజస్తంభంపై పతాకాన్ని ఆవిష్కరించి ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నామని, ఆ తర్వాత ఆలయం చుట్టూ శిలువ మార్గ తిరుప్పలి, రాత్రి ఉత్సవాల తిరుప్పలి నిర్వహించనున్నారు. రాత్రి 9 గంటలకు ఆంథోనియర్ రథోత్సవం జరుగుతుంది. మరుసటి రోజు ఉదయం 7 గంటలకు ఉత్సవాల తిరుప్పలి ప్రారంభమవుతుంది. సుమారు రెండు గంటలకు పైగా ఈ ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతాయి. భారత, శ్రీలంక దేశాలకు చెందిన ప్రజలు, ప్రత్యేకించి జాలర్లు, రెండు దేశాలకు చెందిన క్రైస్తవ మతపెద్దలు పాల్గొననున్నారు. ఈ వేడుకలకు సంబంధించి నెడుదీవి బిషప్ అశోక్ వినో మాట్లాడుతూ ఆంథోనియర్ ఆలయ ఉత్సవాల ఆహ్వానపత్రికను రామనాథపురం జిల్లా కలెక్టర్‌ను కలుసుకుని అందజేయనున్నామని, ఈ వేడుకలకు రామనాథపురం జిల్లా పరిసర ప్రాంతాల నుండి వచ్చే జాలర్లకు ముందస్తు అనుమతివ్వాలని కూడా కోరనున్నామని చెప్పారు.


కచ్చాదీవిలోని ఆంథోనియర్ ఆలయం



చెన్నై శివారులోని పాలవాక్కం బీచ్‌కు బుధవారం మధ్యాహ్నం కొట్టుకొచ్చిన తాబేళ్ల కళేబరాలు.. ఈ మధ్య కాలంలో తాబేళ్ల కళేబరాలు తీరానికి విపరీతంగా కొట్టుకొస్తున్న విషయం తెలిసిందే..


సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్న జపాన్ రాయబారి ఓనో కెయిచి

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

- నలుగురు భక్తులకు స్వల్పగాయాలు -

తిరుమల, జనవరి29(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులో బుధవారం ఓ కారు అదుపతప్పి పిట్టగోడను ఢీకొంది. ఈప్రమాదంలో నలుగురు భక్తులు స్వల్పంగా గాయపడ్డారు. మంగళవారం తిరుమలకు వచ్చిన తమిళనాడులోని శ్రీరంగంకు చెందిన దేవానందన్ కుటుంబం బుధ వారం ఉదయం తిరుగు ప్రయాణమాయ్యరు. ఈక్రమంలో ఏడోమైలు వద్ద కారు ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపునున్న గోడను ఢీకొంది. అదృష్టవ శాత్తు కారులోని ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకోవడంతో నలుగురు స్వల్ప గాయాలతో బయపటపడ్డారు. క్షతగ్రాతులను తిరుపతి స్విమ్స్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

సర్వదర్శనానికి 5 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 5 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 4 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.



సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.78 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,310

తలనీలాలు సమర్పించినవారు: 17,310



పులికాట్ సరస్సుకూ, బంగాళాఖాతానికీ నడుమ ఉండే శ్రీహరికోట ఒకప్పుడు చిన్నదీవి. అడవి మీద ఆధారపడి నాగరిక ప్రపంచం ఎరుగని ఏనాదులు ఉండేవారు. వ్యవసాయం చేసుకుంటూ తూర్పు రెడ్లు చిన్న చిన్న ఊళ్లుగా ఉండేవారు. 1970ల నుంచీ ఈ దీవి రూపు రేఖలు మారిపోయాయి. సూళ్లూరుపేట నుంచి పులికాట్‌ను చీలుస్తూ రోడ్డు వేయడంతో ప్రధాన భూభాగంతో కలిసిపోయింది. 1969లో రాకెట్‌ల ప్రయోగానికి అనువైన ప్రదేశం అని శ్రీహరికోటను గుర్తించిన తర్వాత నిర్మాణాలు పెరిగాయి. ప్రయోగాల వేదికగా అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ వచ్చింది. సైకిల్ మీద రాకెట్‌లను మోసుకొచ్చి ప్రయోగించిన దశ నుంచి అంతరిక్షంలో ఏకంగా ఒకశాశ్వత ప్రయోగశాలనే నిర్మించే దిశగా జరుగుతున్న పరిణామాలకు ప్రధాన కేంద్రంగా శ్రీహరికోట మారింది. అవసరాలకు అనుగుణంగా రాకెట్లను రూపొందించుకుంటూ వందవ రాకెట్‌ను బుధవారం నింగిలోకి సగర్వంగా శ్రీహరికోట ఎగరేసింది. ఈ సందర్భంగా వంద రాకెట్ల విశేషాల సమాహారం...

- కథనం - సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)




చిన్న ప్రయోగాలతో ప్రారంభం.. నేడు భారీ ప్రయోగాలు

ఎస్ఎల్వీ-డీ 1తో శ్రీకారం

1979 ఆగస్టు 19న తొలిసారిగా ఎస్ఎల్వీ-డీ1 పేరుతో 40 కిలోల బరువు కలిగిన రోహిణి-1 ఉపగ్రహాన్ని షార్ నుంచి రోదసీలోకి పంపారు. అతి తక్కువ బరువు కలిగిన ఈ ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా ఉన్న లియో అర్బిట్‌లోకి పంపించారు. ఈ సిరీస్‌లో 1983 వరకు ఐదేళ్లలో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. అనంతం 1980 జూలై 18న 35 కిలోల ఆర్ఎస్-1 ఉపగ్రహం, 1981 మే 31న 38 కిలోల బరువుగల ఆర్ఎస్-డీ1 ఉపగ్రహం, 1983 ఏప్రిల్ 17న 41.5 కిలోల బరువు గల ఆర్ఎస్-డీ2 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపారు.

రెండో రాకెట్... ఏఎస్ఎల్వీ


1987 మార్చి 24న ఏఎస్ఎల్వీ-డీ1 పేరుతో 150 కిలోల బరువు గల స్రాస్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. 100 కిలోల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు రెండో దశలో రూపొందించుకున్న రాకెట్ ఇది. 1987 నుంచి 1994 మధ్యలో ఈ సిరీస్‌లో మొత్తం నాలుగు ప్రయోగాలు చేపట్టారు. రెండు దశల ఘన ఇంధనం వినియోగించే రాకెట్ ఇది.



ఇస్రో విజయ కెరటం పీఎస్ఎల్వీ

1993 సెప్టెంబరు 20న పీఎస్ఎల్వీ-డీ1 రాకెట్ తొలి ప్రయోగం విఫలమైంది. అయితే 1994 అక్టోబరు 15న 804 కిలోల బరువుతో ఐఆర్ఎస్-పీ2 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి చేర్చింది. ఆ తర్వాత ఈ రాకెట్ విజయ రికార్డులను నెలకొల్పుకుంటూ వెళ్తోంది. తక్కువ బరువు కలిగిన విదేశీ ఉపగ్రహాలు కూడా పీఎస్ఎల్వీల ద్వారానే ప్రయోగించారు. చంద్రయాన్-1, ఐఆర్ఎన్ఎస్ వంటి సిరీస్ ప్రయోగాలు దీని ద్వారానే అంతరిక్షంలోకి పంపారు. ఇప్పటి వరకు ఈ సరీస్‌లో 62 ప్రయోగాలు చేపట్టారు. రెండు ప్రయోగాలు మినహా మిగిలినవన్నీ విజయవంతం అయ్యాయి. ఒకేసారి 104 ఉపగ్రహాలను అంతరిక్షంలో ప్రవేశ పెట్టిన అద్భుత రాకెట్ ఇది.

- 1993 నుంచి 2003 వరకు పదేళ్లలో పీఎస్ఎల్వీ ప్రయోగాలు 8.
- 2004 నుంచి 2014 వరకు 21 ప్రయోగాలు
- 2015 నుంచి 2004 చివరి వరకు 33 ప్రయోగాలు





భవిష్యత్‌లో..

గగన్‌యాన్ మిషన్ ప్రయోగం, చంద్రయాన్-4 వంటి భారీ ప్రయోగాల పై దృష్టిసారించారు. షార్‌లో రెండు ప్రయోగ వేదికలు, నాలుగు అనుసంధాన భవనాలు, ఎంఎస్‌టీ టవర్ వసతులు ఉన్నాయి. మూడో లాంచ్‌ప్యాడ్ అత్యంత అధునాతన వసతులతో నిర్మించేందుకు ఈ ఏడాదే భూమిపూజ చేయనున్నారు. ఈ లాంచ్ ప్యాడ్‌ను రెండో ప్రయోగ వేదికకు అనుసంధానంగా నిర్మాణం చేపట్టనున్నారు. దీని ద్వారా ఏకంగా 20 నుంచి 30 టన్నుల బరువు గల భారీ ఉపగ్రహాలను ప్రయోగించవచ్చుని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.



కమ్యూనికేషన్ కోసం జీఎస్ఎల్వీ

2001లో ఏప్రిల్ 18న జీఎస్ఎల్వీ-డీ1 రాకెట్ ద్వారా 2 వేల కిలోల బరువు కలిగిన జీశాట్-1 ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. అత్యంత బరువు గల కమ్యూనికేషన్ ఉపగ్రహాలను పంపేందుకు ఇస్రో ఈ రాకెట్‌కు రూపకల్పన చేసింది. ఈ రాకెట్‌లో క్రయోజనిక్ సాంకేతిక పరిజ్ఞానాన్ని తొలుత రష్యా నుంచి పొందినా, తర్వాత పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతోనే వీటిని ప్రయోగిస్తున్నారు. ఈ సిరీస్‌లో మొత్తం 17 ప్రయోగాలు చేపట్టగా నాలుగు మాత్రమే విఫలం చెందాయి.



భారీ ఉపగ్రహాల కోసం ఎల్‌వీఎం3..

2014 డిసెంబరు 18న తొలిసారిగా ఈ ఎల్‌వీఎం3 ద్వారా క్రూ మాడ్యూల్ రీ ఎంట్రీ విజయవంతంగా చేపట్టారు. అనంతరం 2017 జూలై 5న ఎల్‌వీఎం3-డీ1 ద్వారా జీశాట్-19 కమ్యూనికేషన్ రంగానికి చెందిన ఉపగ్రహాన్ని విజయవంతంగా పంపారు. 2014 నుంచి 2023 వరకు ఈ సిరీస్‌లో మొత్తం 7 ప్రయోగాలు చేపట్టగా 7 విజయం చెందాయి. ఈ వాహక నౌక ద్వారానే చంద్రయాన్-1, చంద్రయాన్-3 ఉపగ్రహాలు పంపారు. నాలుగు నుంచి 5 టన్నుల బరువు గల ఉపగ్రహాలను పంపేందుకు ఎల్‌వీఎం3 వాహక నౌక రూపొందించారు.

బుల్లి వాటి కోసం ఎస్ఎస్ఎల్వీ

2022 ఆగస్టు-07న ఎస్ఎస్ఎల్వీ రాకెట్ ద్వారా ఈవోఎస్-02 ఉపగ్రహం పంపారు. ఇవి విఫలం చెందింది. అనంతరం వివిధ పరీక్షలు నిర్వహించి తిరిగి 2023 ఫిబ్రవరి 10న ఈవోఎస్07 ఉపగ్రహాన్ని ఇదే రాకెట్ ద్వారా పంపి విజయం సాధించారు. అనంతరం 2024 ఆగస్టు 16న ఈవోఎస్-08 ఉపగ్రహ ప్రయోగం చేపట్టారు. ఈ సిరీస్‌లో మొత్తం మూడు ప్రయోగాలు చేపట్టారు. తక్కువ బరువు గల ఉపగ్రహాలను రోదసీలోకి పంపేదుకు ఇస్రో ఎస్ఎస్ఎల్వీని అందుబాటులోకి తెచ్చింది.



యువతులను కారులో వెంబడించిన యువకులు

● నలుగురిపై కేసు నమోదు

చెన్నై, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు ముట్టుకాడు సమీపంలో ఈ నెల 24 వేకువజాము నలుగురు యువతులు ప్రయాణిస్తున్న కారును వెంబడించి వారిని తరుముతూ భయభ్రాంతులకు గురిచేసిన నలుగురిపై కానత్తూరు పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎంకే జెండా కట్టి ఉన్న ఆ కారులో నలుగురు దుండగులు సినీ ఫక్కీలో యువతులు ప్రయాణించిన కారును చేజ్‌చేసారు. అంతటితో ఆగకుండా యువతుల కారు దాటుకుని వెళ్లి రోడ్డుకు అడ్డంగా తమ కారును నిలబెట్టారు. దీంతో యువతులు కారు రివర్స్ చేస్తుండగా కారులో నుండి దిగిన ఓ యువకుడు ఆయుధాన్ని పట్టుకుని వేగంగా దూసుకొచ్చాడు. ఈ దృశ్యాలున్న వీడియో అన్నాడీఎంకే ఐటీ విభాగం బుధవారం ఉదయం విడుదల చేసింది. ఆ వీడియో సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అయ్యింది. ఆ వీడియోను ఎక్స్‌పేజీలో పోస్టు చేసిన అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డీఎంకే పాలకులపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. నగరంలో మహిళలకు భద్రతలేదని ముట్టుకాడులో డీఎంకే జెండా కట్టిన కారులోని దుండగులు చేసిన అకృత్యాలే నిరూపిస్తున్నాయన్నారు. పీఎంకే నేత అన్బుమణి రాందాస్ ఓ ప్రకటనలో యువతులను భయపెట్టి పారిపోయిన డీఎంకేకు చెందినవారుగా అనుమానిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం పరారీలో ఉన్న నలుగురు యువకులపై కానత్తూరు పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని పోలీసు శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. పోలీసు శాఖ ప్రకటన ప్రకారం నలుగురు మహిళలు, ఇద్దరు పురుషులు ఓ కారులో ముట్టుకాడు వెళ్లి ఇంటికి తిరిగి వెళ్లేందుకు పార్కింగ్ ప్రాంతం నుండి కారు రివర్స్ చేస్తుండగా నలుగురు యువకులకు చెందిన కారును ఢీకొట్టింది. దీంతో యువకుల కారు పాక్షికంగా దెబ్బతిందని, దాని కారణంగానే కారును ఢీకొట్టి ఆ నలుగురు మహిళలు తమ కారును వేగంతో నడపటం చూసి యువకులు వెంబడించారని ఆ ప్రకటనలో వివరించారు. ముట్టుకాడు ప్రాంతంలోని సీసీ ఫుటేజ్ ఆధారంగా మహిళల కారు వెంబడించిన నలుగురిని గుర్తించామని, పరారీలో ఉన్న వారి ఆచూకీ కోసం ప్రత్యేక దళాలు గాలింపు చర్యలు చేపట్టాయని పోలీసు శాఖ ప్రకటించింది.


సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు

కష్టపడి చదివితే భవిష్యత్తు మీ చేతుల్లోనే

● ట్రైనీ కలెక్టర్ ఆయుష్ గుప్తా

తిరుత్తణి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రైనీ కలెక్టర్ ఆయుష్ గుప్తాకు కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ ఆయుష్‌గుప్తా మాట్లాడుతూ.. భవిషత్తు యువతదేనని, ప్రతి ఒక్కరు కష్టపడి సంకల్పదీక్షతో ప్రయత్నిస్తే ఏదైనా సాధించగలరని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి సహాయ సంచాలకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ట్రైనీ కలెక్టర్

తిరువళ్లూరు బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా అశ్విన్

తిరుత్తణి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా అధ్యక్షుడిగా అశ్విన్‌ను నియమిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. ఈ క్రమంలో అశ్విన్ సహచరులు తిరువళ్లూరు బైపాస్ రోడ్డులో ఉన్న కల్యాణ మండపంలో అశ్విన్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. అశ్విన్‌ను బీజేపీ శ్రేణులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లిపట్టు మండల అధ్యక్షుడు కిరణకుమార్ సహా పలువురు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.


అశ్విన్‌ను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

జంతు బలుల వ్యవహారం .. మంత్రి పీకే శేఖర్‌బాబు వివరణ

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలోని తిరుప్పరంకుండ్రం కొండపై కోళ్లు, మేకలను బలివ్వడాన్ని నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌కు హైకోర్టు మదురై బెంచ్ ఆదేశించిన విషయం తెలిసిందే!. ఈ వ్యవహారంపై స్పందించిన దేవాదాయ శాఖా మంత్రి పీకే శేఖర్‌బాబు బుధవారం మీడియాతో మాట్లాడుతూ, 11 తీర్థ కొలనులతో విరాజిల్లుతున్న సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై సికిందర్ బాదుషా దర్గా ఉందని తెలిపారు. కొండపై ఉన్న సుబ్రమణ్యస్వామి ఆలయం, దర్గా నిర్వాహకుల మధ్య ఇప్పటి వరకు మతపరంగా ఎలాంటి విభేదాలు జరగదన్నారు. డీఎంకే ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాలు, మతాలను సమానంగా చూస్తోందని, తిరుప్పరంకుండ్రం వ్యవహారంలో మత సామరస్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

4న చెన్నై జిల్లా అన్నాడీఎంకే సమావేశం

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరంలోని అన్నాడీఎంకే నిర్వాహకులతో ఫిబ్రవరి 4న సమావేశం నిర్వహించి అధిష్టానానికి నివేదిక సమర్పించాలని పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆదేశించారు. జిల్లా పార్టీ కార్యదర్శులు, మాజీమంత్రులు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు సమావేశమై పార్టీ అభివృద్ధి కోసం చేపడుతున్న పనులు, పార్టీ సభ్యత్వం, కొత్తగా చేరిన వారికి గుర్తింపు కార్డుల పంపిణీ తదితర అంశాలను ఈ సమావేశంలో చర్చించి నివేదికగా పార్టీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని ఈపీఎస్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

విజయ్ రాజకీయం సినిమాల్లో అతిథి పాత్రలాంటిది

● కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం

ప్యారీస్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు సినీ నటుడు విజయ్ రాజకీలు సినిమాల్లో కాసేపు కనిపించే అతిథిపాత్రలాంటిదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం వ్యాఖ్యానించారు. శివగంగా కాంగ్రెస్ కార్తీ చిదంబరం బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటి వరకు 3నెలల వేతనం ఇవ్వలేదని బాధిత కార్మికులు వాపోతున్నారని వారికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు న్యాయంచేయాలని డిమాండ్ చేశారు. క్వారీల అక్రమాల గురించి మీడియా ద్వారా బహిరంగ పరచిన సంఘసేవకుడు జగబర్ అలీ హత్యకేసు విచారణ పారదర్శకంగా ఉండాలని సూచించారు. సినిమాల్లో నటించే నటీనటులు వెండితెరపై అతిథిపాత్రలో కొంతసేపు కనిపిస్తుంటారని, విజయ్ రాజకీయం జీవితం కూడా అలాంటిదేనని కార్తీ చిదంబరం ఎద్దేవాచేశారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్టు

శ్రీకాళహస్తి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తుండగా ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్లు రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం నిందితులను ఏర్పేడు పోలీస్‌స్టేషన్‌లో అరెస్టు చూపారు. ఏర్పేడు మండలం మేర్లపాక దళితవాడ బస్టాపు వద్ద ఇద్దరు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లుగా సీఐ జయచంద్ర సమాచారం అందుకున్నారు. సిబ్బందితో కలిసి దాడి చేసి ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లాకు చందిన నవీన్‌కుమార్, వేలూరు జిల్లాకు చెందిన మునస్వామిగా నిర్ధారించారు. వీరు ఏపీలోని అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తుల నుంచి గంజాయి కొనుగోలు చేసి శ్రీకాళహస్తి, రేణిగుంట రైల్వేస్టేషన్ పరిసరాల్లో విక్రయించేందుకు ఏర్పేడులో సంచరిస్తున్నట్లుగా తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ చూపిన రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జయచంద్ర, సిబ్బందిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించనట్లు పేర్కొన్నారు.


నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ